కథ


# ఒంటరి

- కె.కె. రఘునందన

ఈ రోజు నుండీ దయాసాగరం వారం పాటు ఇంటిపట్టున ఉండడు. ఆ సంగతి తలచుకుంటే కార్తీక్ హృదిలో మధురాతి మధురమైన ఆలోచనలు చెలరేగుతున్నాయి.

ఈ మధ్యన తమ ఇంటి ప్రక్కన దిగిన కొత్తజంట దయాసాగరం, నవీనా... అతను పేరున్న ఓ టూత్‌పేస్టు కంపెనీలో ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. మూడు జిల్లాలు చుట్టి రావాలి. నెలకు అయిదారు సార్లు మాత్రమే ఇంటి మొహం చూడగలిగే అవకాశం...

ఆ విషయం గ్రహించే కార్తీక్ దృష్టి నవీనపై పడింది. నవీన పోతపోసిన పుత్తడి బొమ్మ... బింకమైన పొంకాలు. చిక్కిన నడుము మడతల్లో మెరుపులు ఎవరు చూసినా మూర్ఛిల్లటం ఖాయం...



తోటమాలి కాపుకి నోచుకోని ఒంటరి వృక్షం నవీన.

అటువంటి నవీనకోసం తహతహలాడసాగాడు కార్తీక్. అతని పెదాలపై నవీన నామమే నానుతోంది. ఇదివరలో ఆమెపై మాగన్నుగా ఉన్నకాంక్ష తొలకరి చినుకులకు పొటమరించిన అంకురంలా ఒక్క ఉదుటున తొంగి చూడసాగింది.

సన్నగా కాడలాగ ఉన్న దయాసాగరం నవీనకు సరిజోడు కాదు. వారానికోసారి గడపతొక్కే అతగాడితో ఆమె ఎలా సంసారం చేస్తుందో అర్థం కాదు.

ఒంటరితనంతో దహించుకుపోతున్న నవీనను పేలవమైన, నిరామయ జీవితంలో కొత్త పుంతలు తొక్కించాలి. ఆమెకు తెలియని దివ్యమైన అనుభూతుల మకరంద మాధుర్యాల ప్రపంచం యివీ అని విశదపరచి నివ్వెరపాటు కలిగించాలి.

కాని, ఇదంతా తన గృహలక్ష్మికి తెలియకుండా గుట్టుగా సాగాల్సిందే! స్నిగ్ధకి అనుమానం రాకూడదు.

నవీన విషయంలో దయాసాగరం లేని సమయాన ఇంట్లో దూరిపోయి దౌర్జన్యంగా వాటేస్కుంటే లొంగుతుందా? తిరగబడుతుందా??

ఏమో కాగలకార్యం గంధర్వులే తీర్చాలి!! ప్చ్!!

***

భర్త కార్తీక్ తీరుతెన్నులు కొత్తగా అనిపించసాగాయి స్నిగ్ధకు. మూడీగా ఉండే మగడిని ఆకట్టు కోవడానికి ఎన్నో రకాల ప్రయత్నాలకు జీవం పోసింది.

భార్యగా స్నిగ్ధ ఎంతో సన్నిహితంగా ఓలలాడిస్తున్నా ఒంటరి నవీనా వైపే కార్తీక్ తుంటరి ఆలోచనలు.

ఎదురు పడినప్పుడల్లా ఓ చిరుదరహాసం వెన్నెల్లా చిందించేది.

నెల దాటింది వాళ్ళు దిగి...

ఓ రోజు – ఆడబోయిన తీర్థం ఎదురైనట్లుగా దయాసాగరమే కోరి పరిచయం చేసుకున్నాడు.

'నా ఉద్యోగం అంతంత మాత్రం... ఊరువాడా తిరిగితే గాని, కుదుర్దు... బంధువర్గమంతా ఒత్తిడి చేస్తే నవీనను చేసుకున్నానుగాని... పెళ్లి నాకు యిష్టం లేనిపని... వారానికోసారి మొహం చూపించే నా వల్ల ఏం సుఖపడుతుందని? ఆమె ఒంటరనే నా బాధల్లా... అయితే నా బెంగంతా ఇక్కడ కొచ్చాక తీరిపోయింది'' అని ఆగాడు.

వేళకాని వేళ భోజనాలు... వీర తిరుగుళ్ళ వల్ల దయాసాగరం మొహం పీక్కుపోయి కాంతి లేని నిస్సారత ప్రస్ఫుటించింది.

'మిమ్మల్ని కలిసి అభ్యర్థించాలని రెండు వారాలుగా ప్రయత్నిస్తున్నా' అని మా దంపతుల వైపు చూశాడు.

చిత్రంగా చూశాం.


'ఎవరికయినా తోడు అవసరం... నాతోపాటుగా ఆమెను

తిప్పలేనుగా... మీరు మా నవీనకు అండగా ఉండండి... కాకపోతే ఆమెకు పుస్తకాల పిచ్చి... మీ దగ్గరుంటే యివ్వండి... కేబుల్ ఖర్చు అని నేనే పెట్టించలేదు... పోనీ మీ ఇంటికి టీవీకి వస్తుంది... దయచేసి అపార్థం చేసుకోరుగా..' దీనంగా అడిగాడు.

దయాసాగరం కోరికలు సాదాసీదావే! తమింటి నిండా పుస్తకాల గుట్టలే! వాటిలోంచి తీసి నవీనకు యివ్వటం ఓ పెద్ద పని కాదు. టీవీకి రావటానికి అంతకంటే అభ్యంతరం లేదు... తనకు మంచి అవకాశం కూడాను.

మా అంగీకారం తెలపటం తోటే దయాసాగారం మొహం వెలిగిపోయింది. కృతజ్ఞతలు తెలిపి వెళ్లిపోయాడు.

''స్నిగ్ధా! ఆవిడ టీవీకి రావటానికి మొహమాట పడుతున్నట్లుగా నాకు అనిపిస్తుంది. పోనీ మనమే కేబుల్ పెట్టిస్తే...'' అనడిగాడు కార్తీక్.



స్నిగ్ధ సరేనంది.

వారికి మరీమరీ కృతజ్ఞతలు తెలియచేసింది నవీన.

ఈ ఏర్పాట్లన్నీ దేనికయ్యా అంటే కేవలం

నవీనా మెప్పుపొందితే, ఆమె కటాక్షం లభ్యమైనాక, శృంగార మోక్షం సిద్ధిస్తుందని...

ఇదంతా గమనిస్తున్నా సరే తేలిగ్గా తీసుకుంది స్నిగ్ధ. దయాసాగరం అభ్యర్థన వల్లనే శ్రీవారు స్నేహహస్తం అందిస్తూ సహాయ పడుతున్నారనే భావంతో ఎటువంటి అపోహకు తావివ్వలేదు... కార్తీక్‌కు అది రాచబాటయ్యింది.

దయాసాగారానికి క్యాంపుల మీద క్యాంపులు... నెలకి ఓసారి కూడా రాలేని స్థితి. అతనికి కంపెనీ వాళ్ళు సెల్ యిచ్చారీ మధ్య. రోజుకో సారి స్నిగ్ధకో, కార్తీక్‌కో ఫోన్‌చేసి తన భార్యకిమ్మనేవాడు.. అదే సందని యింట్లో జొరబడేవాడు కార్తీక్.

నవీన సెల్‌లో మాట్లాడుతుంటే ఆమె పరువాల పంటలను కళ్ళతోనే జుర్రి పారేసేవాడు కార్తీక్. ఆ మిషతో నవీనతో సాన్నిహిత్యం పెంచుకునే వీలు మరింతగా ఏర్పడింది.

ఓరోజు కార్తీక్ ఆఫీసునుండి వచ్చేసరికి స్నిగ్ధ బయటకెళ్ళింది. తాళాలు నవీనకు యివ్వటం పరిపాటని ఆమె గుమ్మం బయట నిలుచుని తలుపు తట్టాడు. ఎంతోసేపు తట్టాక తెరచింది నవీన.

తత్తరబిత్తరగా ఎదురవటంతో ఆమె పరిస్థితి చూసి దిమ్మెరపోయాడు. కేవలం టవల్‌తో మాత్రమే గుండెలపై అచ్ఛాదనతో... ఆమె తాళాలు యివ్వటానికి వస్తుంటే కార్తీక్ మరో అడుగు ముందు కేశాడు. నవీన తొట్రుపడి టవల్ చేజార్చింది. ఆమె శరీరం సర్వం కార్తీక్ కళ్ళబడింది.

స్త్రీని తమ కావ్యాల్లో సంపూర్ణ వర్ణన చేసిన మహానీయకవులెందరో!! కానీ ఇప్పుడా వర్ణనలకు పరిపూర్ణ న్యాయం జరిగినట్లుగా అనిపించింది.

సప్తవర్ణిత శోభిత ఇంద్రధనువు – ఆమె సుగంధ భరితదేహం! ''కార్తీక్ గారూ! మీ తాళాలు...'' అని చేతిలో పెట్టబోయేంతలోనే కార్తీక్ గుండె ధైర్యం తెచ్చుకొని ఆమెను పొదివి పట్టుకున్నాడు.

ఒక్కసారి మ్రాన్పడిపోయిందామె. తట్టుకోలేని కోరికలకి రెక్కలొచ్చాయి. అణగారిన వాంఛలు అదుపుతప్పి విశృంఖలతని చాటుకున్నాయి. విచక్షణ నశించింది. పెదవుల మౌనాన్ని ఆశ్రయించి ఆనక ముద్దుమురిపాలకి లొంగిపోయాయి.



నిస్తేజంగా వున్న దేహం కార్తీక్ తాకిడితో శృంగార పరిమళం అబ్బి జ్వాజ్వల్యమానమయింది. మధురానుభవాల దొంతరలతో కాలం దొర్లిపోయింది.

''ఏమండోయ్ మిమ్మల్నే.. సారీ అండీ! మీకు తాళాలిమ్మని చెబితే తలంటుకుందామని బాత్రూంలో దూరాను. బాగా ఆలస్యమైపోయింది'' తన చేతికి తాళాల గుత్తి తగిలేదాకా ఈ లోకంలో లేడు కార్తీక్.

అంటే తను ఈ క్షణం దాకా నవీన ఊహలలో బ్రతికాడా నిజంగా కలలోలా ఆ అనుభవం తనకు దక్కితే... ఎంత కమ్మగా ఉంటుందని...

లేదు... మరింక తాత్సారం పనికిరాదు. పథకాలు విస్తరింపచేయాలి. దయాసాగారం లేని తరుణమిదే!!

ఆమె ఒంటరి... అదే తనకు ప్లస్ పాయింట్..

కార్తీక్ ఇంకా యోచనల్లో వుండగానే స్నిగ్ధ వచ్చేసింది. తనే తాళాలు తీసింది... లోనికి వెళ్లి స్నానం చేసాకగాని మైకం వదలల్లేదు. కార్తీక్‌కు.

కాఫీ యిస్తూ – ''అన్నట్లు... ఉదయం మీరు ఆఫీసుకు వెళ్లగానే మీ మిత్రుడు సుందర్రావుట... వచ్చాడు... చాలాసేపు మీ గురించే చెప్పుకొచ్చాడు.. మీ ఫోన్‌కి చేసాను. విషయం చెబుదామని... మీ సెల్ స్విచ్ఛాఫ్‌లో వుంది. చూసి చూసి వెళ్లిపోయాడు'' చెప్పింది స్నిగ్ధ.

సుందర్రావు వికారం మనిషి... వాడికి ఆడపిల్లలను ఏడిపించనిదే నిద్ర పట్టేదికాదు. శృంగార విషయాలు ఎక్కువగా చర్చించేవాడు. వెధవ... ఈ సుందర్రావు గాడికి తన అడ్రసెలా దొరికిందో చెప్మా... అయినా వాడికి తనతో పనేంటి? అసహనంగా ఆలోచనల్లో పడ్డాడు కార్తీక్.

***

ఆ నెలలో ఒక రోజు దయాసాగరం ఇంటికి వచ్చి ఆ సాయంత్రమే వెళ్లిపోతూ కార్తీక్‌ను కలిసి – 'థాంక్యూ! మిత్రమా! మా ఆవిడకి మంచి కాలక్షేపంగా మీరిద్దరూ కేబుల్ పెట్టించారు. పుస్తకాల సరఫరా సరేసరి. అయితే ఫోన్‌చేసి మిమ్మల్ని విసిగిస్తున్నందుకు సారీ!! ఏమయితేనేం ఒంటరి నవీనకు మీరే తోడు – నీడ. నా పరిస్థితులకు – తలొగ్గక తప్పదు'' అని చేతులు పట్టుకుని మరీ చెప్పాడు.

## మహేష్‌తో ఒక్క ఛాన్స్ చాలు

హీరోయిన్‌గా పెద్దగా సక్సెస్ కాకపోయినా, అడపతడపాగా వచ్చే అవకాశాలతో తెలుగు ప్రేక్షకులకు కనపడతున్న కామ్నా జత్మాలానికి ఇప్పుడు ఓ కోరిక కలిగింది. అదే మహేష్ బాబుతో పూర్తిస్థాయి హీరోయిన్‌గా నటిస్తే చాలట! ఆ ఛాన్స్ వస్తే నేనేమిటో నిరూపించుకుంటాను అంటోంది. సినిమాల ఎంపికలో కొద్దిగా తొందరపడ్డాను. ఇక ముందు అలా జరగదు అని చెబుతోంది. అనుష్కకు దొరికినట్టుగా తనకూ ఓ 'అరుంధతి' దొరికితే టాప్ హీరోయిన్ పొజిషన్‌కి వచ్చేస్తాను అంటోంది. మరి కామ్నా కోరిక నెరవేరుతుందో లేదో చూడాలి!

అతను వెళ్లిపోయాక హాయిగా నిట్టూర్చాడు కార్తీక్. మరో నెలదాకా దయాసాగరం పికరుండదు. ఈలోగానే తను ఎత్తులు వేసి నవీనను కౌగిట్లోకి తీసుకుని మజా చేయాలి. పెదాల అద్దకంలో ఎంతటి మహత్తుంటుందో తెలియచేస్తూ ఉల్లాసపరచాలి...

రెండు తనువుల సమాగమంలో ఉద్వేగాలను కొలవడానికి ఎటువంటి శాస్త్రీయ పరికరం కనుక్కోలేదన్న నగ్నసత్యం రుజువు చేయాలి.

ఆఫీసులో వున్నా సరే కార్తీక్‌ను అత్యుత్సాహంగా ఉంచగలుగుతున్న ఒకే ఒక్క విశేషాంశం – నవీన 'ఒంటరి' అన్నదే!

ఒక రోజు ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి కిలకిల నవ్వులు వినిపించాయి కార్తీక్‌కు.

గభాలున అడుగు పెట్టాడు.

''ఏంరా! పరాయివాడిలా చూస్తావేంటి! నేనేరా... నీ సందుగాడ్ని మొన్న వచ్చాను. లేవాయె.. ఈ రోజు కూడా నీ దర్శనం లభించదనుకున్నాను. సరే! నువ్వు నా జోకులకి ఎంతలా నవ్వేవాడివో! నీలాగే మీ శ్రీమతి కూడా తెగ నవ్వుతోంది...'' అన్నాడు సుందర్రావు...

కార్తీక్ నవ్వేస్థితిలో లేడు. తను లేని సమయంలో వాడొచ్చి తిష్ట వేయడం ఏ మాత్రం రుచించటం లేదు. అన్యమనస్కంగానే సుందర్రావుతో గడిపాడు. చాలాసేపు తర్వాత లేచాక, రోడ్డు దాకా దిగ బెట్టాడు కార్తీక్.

''నేను లేనప్పుడు వాడొస్తే, వెళ్ళమనలేక పోయావా?'' తిరిగి వచ్చి విసవిసలాడాడు కార్తీక్.

''అబ్బ! అతగాడొచ్చి కూర్చుంటే నేను లేపలేన్నుకదా! నా కసలే మొహమాటం... మీ స్నేహితుడనగానే ఏమన లేకపోయాను..''

''ఆ బోడి పరిచయం...'' విసుగ్గా అన్నాడు.

''చూశారా! మీకు నా మీద ఎంత ప్రేమో, పరాయివాడు మీరు లేనప్పుడు వచ్చేడనగానే ఎంత కోపం వచ్చేసిందో... నేను మరో మనిషితో మాట్లాడితే మీరు సహించలేరు కదూ!'' అని హత్తుకు పోయింది స్నిగ్ధ....

కార్తీక్‌కి ఆ రాత్రి నవరాత్రిగా మిగిలింది.

***

దయాసాగరం నుండి ఫోన్‌వస్తే సెల్ పట్టుకుని నవీన దగ్గరకు వెళ్లాడు కార్తీక్... మిల్కీవైట్ నైటీలో ఉందామె. అవయవాల పారదర్శకత కార్తీక్‌ను ఉన్మత్తుడిని చేసింది. ఆమెసెల్‌లో మాట్లాడు తున్నంతసేపు అతనివి ఎక్సరే చూపులే!

''ఛ! ఈయన ఈవారం కూడా రారట... ఈ ఒంటరితనం ఎంత ఘోరమో కదా!'' అంది చిరాగ్గా...

అంతలోనే స్నిగ్ధ నుండి పిలుపు... తేరుకుని కదిలాడు కార్తీక్...

''నేను సంగీత కచేరీకి వెళతాను.. మీరొస్తారా...'' అడిగింది స్నిగ్ధ.

''సంగీతమా! నాకు బోరు బాబు!'' అన్నాడు నిరాసక్తంగా.

''అయితే మీరుండండి.. నేను ఒక్కదాన్ని వెళతాను.. అన్నట్లు మీకో సంగతి... ఇందాక సుందర్రావు వచ్చి వెళ్లాడు... మీరు ఇప్పట్లోరారని చెప్పాక గాని కదల్లేదు'' అంది స్నిగ్ధ.

''నేను ఆఫీసునుండి వచ్చాక చావచ్చు గదా వెధవా... గెంటేయవలసింది..'' అక్కసుగా అన్నాడు కార్తీక్.

భార్య స్నిగ్ధ వెళ్లిపోయాక ఫ్రెష్‌గా తయారయ్యాడు కార్తీక్. బాత్రూంలోంచి కార్తీక్ బయట పడే సరికి వాతావరణం ఆకస్మిక మార్పును సంతరించుకున్నది. 'వానరాక ప్రాణంపోక తెలీదట' అటువంటి పరిస్థితే!

విపరీతమైన గాలులు.. నల్లని మేఘాలు ఆకాశమంతా తలుపురెక్కల టపటప శబ్దాలు. ఫెళఫెళార్భాటాలతో పిడుగులు పడుతున్నాయి. తళుక్కుమన్న మెరుపులు..

కరెంటు పోయింది. ఇల్లంతా చీకటయింది.

కార్తీక్‌లో అసలు సిసలు మగాడు విజృంభించాడు.

ఆ క్షణం ఎవరి అడ్డంకూ లేదు.

ఆ చీకట్లోనే నడిచాడు. కావాలనే క్రొవ్వొత్తి వెలిగించి చేత్తో పట్టుకుని నవీన ఇంటి తలుపు తట్టాడు.

''అరె! నేనే మీకు కొవ్వొత్తి యిద్దామనుకున్నాను. మీరే శ్రమ తీసుకున్నారు..'' అని చేతిలోంచి కొవ్వొత్తి తీసుకుని లోనికి నడిచింది.

బయట కుండపోత ... హోరు...

వెనకమాలే వెళ్లి గభాలున కౌగలించుకుంటే – అలా అనుకోగానే – ''అయ్యో! మీ శ్రీమతి గారు... యిలా వెళ్లారో లేదో అలా శనిలా పట్టుకుంది వాన... పాపం! ఎక్కడ చిక్కుకుపోయారో! ఎందుకయినా మంచిది ఓ సారి ఫోన్ చేయండి'' అంటూ సానుభూతిగా అన్నది నవీన.

ఆమె అలా అంటున్నా కార్తీక్ డోలాయమాన స్థితిలో కొట్టుకుపోయాడు. తనకు ఈ వర్షపు వాతావరణంలో లభించిన ఈ అరుదయిన సువర్ణావకాశాన్ని వినియోగించుకోక పోవటమంత వెర్రితనం మరోటి ఉండదు.

లెక్క జమ లేకుండా కురుస్తోంది వాన.

''అదేంటి సార్! మీరేంటలా? అంతటెన్షన్ పడ్తున్నారు. మీ శ్రీమతి వర్షంలో చిక్కడిపోయారనేగా... ఏదీ ఫోన్ యిలా యివ్వండి... కాల్ చేద్దాం... మనం కాసేపు ధైర్యం చెబుతాం'' అని సెల్ తీసుకుని డయల్ చేసింది నవీన.

''అరె సిగ్నల్ వీక్... నో రిప్లై...!'' విచారంగా అంది నవీన.

కార్తీక్‌లో ఫుల్ సిగ్నల్... ఆడ పదార్థంపై చావని మక్కువ. ఒడిసి పట్టేయాలన్నంత ఉద్విగ్నత... నవీనను సందిట్లో బందీచేసి ఉక్కిరిబిక్కిరి చేసి లొంగదీసుకుంటే... వేడికోర్కెలతో వేగిపోతున్న ఆమె తనను అర్పించుకోవటం ఖాయం!!

ఈ అత్యద్భుత అవకాశం చేజార్చుకుంటే తిరిగి రాదు. ఆ విధంగా మానసిక సంసిద్ధుడయి నవీన వెనుకనుండి వెళ్లబోయే సరికి... సెల్ మ్రోగసాగింది.

సెల్ విసిరి కొట్టాలనుకుని చూశాడు.

ఎవరో కాదు. భార్య స్నిగ్ధనుండి కాల్..

''ఏమండీ... నేను ఇక్కడ... వానలో... నన్ను... నన్ను'' మాటలు నత్తినత్తిగా కట్ అయిపోతూ వినిపించి ఆగిపోయాయి.

మరెంత ప్రయత్నించినా లైన్ కలవలేదు.

ఒక్కసారిగా చలించిపోయాడు కార్తీక్. శ్రీమతి ఒంటరిగా వెళ్లింది. అది కనిపెట్టిన సుందుగాడే యిదే అదను చూసుకుని వేధించివుంటాడు. జరగబోయేది తలచుకుంటుంటే గుండె దడ పుడ్తున్నది.

వెంటనే బైకు తీశాడు.

వర్షధారల్లో రోడ్ల గతుకుల్లో ఎలా నడుపుతున్నాడో అనూహ్యం. దారికడాకు కళ్లు చిట్లించి చూస్తున్నాడు. అయినా సిగ్ధ జాడలేదు.

సంగీత కాలేజీలో వెతికాడు. కచేరి రద్దయిందట. వెంటనే తిరుగుముఖం పట్టాడు. సెల్‌లో కాల్ చేస్తుంటే. నో రిప్లై... ఊరంతా తిరితి తిరిగి విసుగెత్తి ఇంటికెళ్లి పోయాడు కార్తీక్.

ఇంట్లోకి ప్రవేశించేసరికి స్నిగ్ధ ఏడుస్తూ కనిపించింది. ''ఇంతకీ! ఆ రాస్కెల్ ఏడి...? వెధవ... ఒంటరిగా వున్న నిన్ను ఆ సుందర్రావుగాడు..'' పళ్ళు పటపటమని కొరికాడు.

''ఛ! అలా అతడ్ని తిట్టుకోకండి. అతడి ప్రమేయం లేనేలేదు. కొందరి పోకిరీ రాయుళ్లు వెంటబడి వేధిస్తుంటే ఆపద్బాంధవుడిలాగా దయాసాగరం అన్నయ్య నా కెదురుపడ్డారు. వాళ్లకు బుద్ధి చెప్పి నన్ను సురక్షితంగా ఇక్కడికి చేర్చారు... ఒంటరిగా వున్న ఆడదంటే. అందరికీలోకువే. రక్షించాల్సింది పోయి భక్షించాలని చూస్తారు. నూటికో కోటికో దయాసాగరం లాంటి వారు తప్ప..'' అని కళ్ళు తుడుకుకుంది సిగ్ధ.

భార్య మాటలు కార్తీక్ వెన్ను జలదరించేలా చేసాయి. ఆమె అన్నట్టుగానే నవీన ఒంటరితనంను అలుసుగా చేసుకుని దయాసాగరానికి హాని చేయబోయాడు.

తను గోముఖ వ్యాఘ్రంలా ప్రవర్తించాడు. తన వరకూ వచ్చినప్పుడే ఎవరికయినా దాని బాధ, లోతుపాతులు తెలుస్తాయి.

''స్నిగ్ధ గారూ! మీరలా వెళ్లిన దగ్గర్నుంచీ మీ శ్రీవారికీ ఒకటే టెన్షన్.... నేను చీకట్లో ఎక్కడ భయపడతానో అని కొవ్వొత్తి వెలిగించి మరీ పట్టుకొచ్చారు.. మీ మీద ఎంత ప్రేమో! మీ నుండి ఫోన్ రాగానే వర్షమని కూడా చూడలేదు. ఒకటే పరుగు'' అమాయకంగా యింకా ఏవోవో చెబుతోంది నవీన.

వాటిని వింటుంటే కార్తీక్ మనస్సు కోతపడుతోంది – మబ్బుల్లా కమ్ముకున్న మృగతుల్యపు టాలోచనలకు సమాధి కడ్తున్నట్లు గానూ... ప్రక్షాళన పరిచే దివ్యమైన అమృత వాక్కులివి.

దయాసాగారం తన గొప్పలేవీ చెప్పుకోకుండా నిరాడంబరంగా కనిపించడంతో అతనిలో ఓ దేవుడ్నే చూసాడు కార్తీక్. పశ్చాత్తాపంతో కన్నీళ్లు సుడులు తిరిగినా వాటిని కనిపించనీయక తల దించుకున్నాడు.

*

**చిరునామా:**
**కె.కె.రఘునందన**
**రామతీర్థం – 535218**
**విజయనగరం జిల్లా**
**సెల్: 94926 20382**

## దక్షిణాదికి జెనిలియా గుడ్‌బై?



కోలీవుడ్‌లోనూ, టాలీవుడ్‌లోను విజయాలను సొంతం చేసుకొని సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా పేరుపడిన బబ్లీ గర్ల్ జెనిలియా దక్షిణాదికి గుడ్‌బై కొట్టనుందన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఉత్తరాదిన ఆమెకు పెద్ద పెద్ద సంస్థల నుంచి ఆఫర్లు రావడంతో దక్షిణాదికి దూరం కావాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దక్షిణాదిన సినిమాలు తగ్గించుకోవడమే దీనికి నిదర్శనం. అసిన్ కూడా ప్రారంభంలో ఈవిధమైన స్టేట్‌మెంట్లే ఇచ్చి ఆ తరువాత దక్షిణాది వైపు కన్నెత్తి చూడడం లేదని, జెనిలియా కూడా అసిన్ బాట లోనే పయనించవచ్చని పలువురు అంటున్నారు. అయితే ఈ పుకార్లను జెనిలియా పూర్తిగా కొట్టిపారేస్తోంది. ఈ విరామం తాత్కాలికం మాత్రమేనని, దక్షిణాది రంగాన్ని వదిలేది లేదని స్పష్టం చేస్తోంది. కాకపోతే ఈ మాటలు అందరూ హీరోయిన్లు వల్లించే చిలకపలుకులేనని పరిశ్రమలోని వారంటున్నారు.